# దేశభక్తుడు

దేశభక్తుడు దేశం కోసం తపస్సు చెయ్యసాగాడు. అతని తపస్సు ఫలించి దేశమాత ప్రత్యక్షమయింది.

"ఎందుకు నాయనా, ఇంత దీక్షగా తపస్సు చేస్తున్నావు?" అన్నది దేశమాత.

"నా దేశం యొక్క క్షేమం కోసం! అభ్యుదయం కోసం!" అన్నాడు దేశభక్తుడు.

"నీ దేశానికిప్పుడేం ముప్పువచ్చిందీ?"

"నా దేశం దాస్యంలో పడి ఉన్నది. దేశమాతకు విమోచనం కావాలి."

"నీ దేశమాతనెప్పుడన్నా చూశావా? ఆవిడకు విమోచనము కావాలని నీకెట్లా తెలుసు?" అన్నది దేశమాత.

"అందరూ అంటూంటే విన్నాను. నేనైతే దేశమాతను చూడలేదు... కనీసం నా దేశ వాసులకు విమోచనం కావాలి" అన్నాడు దేశభక్తుడు.

"వాళ్లిప్పుడే విధమైన నిర్బంధంలో ఉన్నారు" అన్నది దేశమాత.

"పాశ్చాత్యుల నిర్బంధంలో."

"పాశ్చాత్యులు నీ దేశ వాసుల చేతులూ కాళ్లూ కట్టేశారా?"

"లేదు. కాని ఈ పాశ్చాత్యుల మూలంగానే నా దేశ ప్రజలు దారిద్ర్యంలో ఉన్నారు."

"అంతకు పూర్వం?"

"అంతకు పూర్వం ఇంత దారిద్ర్యం లేదు. ఇంత దోపిడీ లేదు."

"అంతకు పూర్వం నీదేశంలో దరిద్రులు లేరా? అందరూ డబ్బు న్యాయంగానే సంపాదించారా?"

"కొద్దిమంది దుర్మార్గులు సంఘంలో ఎప్పుడూ ఉంటారు. వాళ్లు మిగిలిన వాళ్లను దోచీ ధనికులవుతారు!"

"వారి తరఫునే కదా నువు తపస్సు చేస్తున్నది?" అన్నది దేశమాత.

"కాదు, కాదు! నిజంగా దారిద్ర్యం అనుభవిస్తున్న కోట్ల కొద్దీ ప్రజల కోసం!" అన్నాడు దేశభక్తుడు.

"నువు కోరే దేశవిముక్తి ఏ విధంగా వాళ్ల దారిద్ర్యం తొలగిస్తుంది?"

"ఆలోచిస్తాను!" అన్నాడు దేశభక్తుడు.

"ఆలోచించుకో!" అని దేశమాత అంతర్ధానమయింది.

"ఎవరమ్మా నీవు?" అన్నాడు దేశభక్తుడు. సమాధానం రాలేదు.

దేశభక్తుడు మళ్లా కళ్లు మూసుకున్నాడు.

❀ ❀ ❀ ❀ ❀

ఈసారి దేశభక్తుడు దేశవాసుల దారిద్ర్యం అంతమొందటానికి తపస్సు చేయసాగాడు!

దేశభక్తుడికి ఈసారి లక్ష్మీదేవి ప్రత్యక్షమయింది.

"ఎందుకు నాయనా, ఇంత దీక్షగా తపస్సు చేస్తున్నావు?" అన్నది లక్ష్మీదేవి.

"నా దేశవాసుల దారిద్ర్యం అంతం కావటానికి" అన్నాడు దేశభక్తుడు.

"పిచ్చివాడా, ఈ దారిద్ర్య సమస్యను గురించి నీకేం తెలుసు. దారిద్ర్యం కేవలం డబ్బువల్లనే కలుగుతున్నదనుకున్నావా? డబ్బంటే ఏమిటి? బీదలు పోగొట్టుకునే వస్తువు. ధనికులు దాచుకునే వస్తువు! ఇవాళ ప్రపంచంలో ఉన్న డబ్బంతా అందరికీ సమంగా పంచినప్పటికీ, ఈ సాంఘిక వాతావరణంలో మళ్లా ఇట్లాగే ధనికులూ, బీదలూ ఏర్పడుతారు."

"ఎందువల్ల?"

"ఎందువల్లనంటే నువు నీ స్నేహితుడి కోసం రూపాయి ఖర్చు చేస్తావు. అడుక్కు తినేవాడికి కానీ ఇవ్వవు. పెట్టుబడిదార్లు తాము ఉపయోగించలేని డబ్బును బ్యాంకుల్లో దాస్తారు గాని కూలీలకివ్వరు."

"ఎందువల్ల?"

"ఎందువల్లనంటే కులతత్వం, వర్గతత్వం! నీ కోసం వాళ్లో నీ వర్గం వాళ్లో బాగుండాలని నువు ప్రయత్నిస్తున్నావు. కొన్ని వర్గాల వారు దారిద్ర్యంలో ఉంటే తప్ప ఫ్యాక్టరీల్లో కూలీ చెయ్యటానికీ, రోడ్లు చిమ్మటానికీ, పాకీ దొడ్లు ఊడవటానికీ ఎవరుంటారు? నీకింద నౌకరీ చేసేవాడు నీకన్న మంచి గుడ్డలు వేసుకొస్తే నువు సహించవు! ఆ గుడ్డల కోసం వాడు నెలకు వారం రోజుల చొప్పున ఒక సంవత్సరం పాటు మాడినా సరే! కులతత్వం!

"ఈ తత్వం మూలంగా బీదలు తమకు కావలసిన వస్తువులు భాగ్యవంతులకంటె ఎక్కువ ఖరీదిచ్చి కొంటున్నారు. రూపాయి బియ్యం కొనేవాడికంటే అర్ధణా బియ్యం

కొనేవాడు కొంటాడు అనేకమంది. బీదలు కాస్తో కూస్తో తెచ్చుకుంటూ కూడా జన్మల్లా అప్పు మీద జీవిస్తారు. అది మరింత గిరాకీ!"

"డబ్బు అందరికీ సమంగా పంచితే ఈ తత్వం పోదా?"

"వర్గతత్వం పోతుంది. కాని కులతత్వం పోదు. ఇప్పుడు అంటరాని వాళ్లని గుళ్లలోకి రానీకుండా ఉన్నారు. రేపు అందరికీ డబ్బు సమంగా పంచితే, డబ్బుచేత కొనరానివన్నీ పై కులాల వాళ్లు కింది కులాల వాళ్లకంద కుండా దాచి పెట్టుకుంటారు. అదివరలో బ్రాహ్మలు వేదశాస్త్రాలు దాచుకోలా?"

"అయితే ఈ కులతత్వం అంతమయితేగాని దేశానికి విముక్తి లేదు. ఇది నాశనం కావటానికి తపస్సు చేస్తాను" అన్నాడు దేశభక్తుడు.

"ఆ పని చెయ్యి. అది అంతమయితే ఒకవేళ ప్రపంచంలో ధనికులున్నప్పటికీ బీదలు మాటాడుతుంటే చూస్తూ ఊరుకోరు. సాంఘిక జీవితంలో స్వార్థం తెచ్చి పెట్టింది కులతత్వమే" అన్నది లక్ష్మీదేవి.

"ఎవరమ్మా నువ్వూ?" అన్నాడు దేశభక్తుడు. కాని సమాధానం చెప్పకుండా దేవి అదృశ్యమయింది.

దేశభక్తుడు మళ్లా కళ్లు మూసుకున్నాడు.

"ఎందుకు నాయనా, ఈ బక ధ్యానం?"

ఈ మాటలు వినగానే దేశభక్తుడు తుళ్లిపడి కళ్లు తెరిచాడు. ఎదట ఒక అతి ముసలి వెధవముండ, పూర్తిగా పళ్లూడిపోయిన బోసినోరూ, దట్టంగా పొరలుగప్పిన కళ్లు పెట్టుకుని కనిపించింది. ఆవిడ తన కాళ్లమీద నిలబడలేదనో ఏమో, పాపం, దండకమండలాలు ధరించిన ఒక సన్నాసీ, దర్భకట్టా, పంచాంగమూ, చంకలోపెట్టుకున్న ఒక శుద్ధ శ్రోత్రియుడూ ఆమె చెరొక రెక్కా పట్టుకున్నారు. వెనకగా వజ్రాల ఉంగరాలు ధరించిన ఒక వైశ్యుడూ, అధికారి దుస్తులు ధరించిన ఒక శూద్రుడూ ఉన్నారు. ఇంకా వెనకగా కత్తులూ, తుపాకులూ ధరించి, చింకిగుడ్డలు కట్టుకొని వొట్టి అమాయకపు మొహాల వాళ్లు కొందరున్నారు.

"వచ్చావా, కులదేవతా? ఈ అట్టహాసమంతా దేనికి? నీ యవ్వనం ఎవడన్నా అపహరిస్తాడనా? నీ అందచందాలు చూసి ఎవడన్నా భ్రమపడతాడనా?" అన్నాడు దేశభక్తుడు.

"కోలాహలే కాకకులస్యజాతే విరాజితే కోకిల కూజితం కిం" అన్నాడు సన్నాసి.

"ఆయన సంస్కృతంలో చెబితే నాఅర్థం కావటంలేదు; మీరంతా ఎందుకొచ్చారో నాకర్థమయేటట్లు చెబుతారా?" అన్నాడు దేశభక్తుడు.

"ఈ తపస్సు చేయటంలో నీ తాత్పర్యం ఏమిటో తెలుసుకోవటానికి వచ్చాం!" అన్నది ముసిల్ది.

"కులతత్వం అంతం కావటానికి! దేశం బాగుపడటానికి!"

"అదేనుట్రా, బాగూ! వర్ణసంకరం కావటం బాగా?"

"చాతుర్వర్ణ్యం మయాసృష్టం గుణకర్మ విభాగవః!" అన్నాడు సన్యాసి.

"వర్ణాశ్రమ ధర్మాలుపోతే మనుష్యులకూ పశువులకూ తేడా ఏమిటి?" అన్నాడు బ్రాహ్మడు.

"మీవంటి మహానుభావుల ఆజ్ఞ శిరసావహించే మనుష్యులకూ పశువులకూ తేడా ఏముంది? మీ వెనక ఆయుధాలు పట్టుకు నిలబడి ఉన్న ఆ మూఢుల మొహాలు చూడండి" అన్నాడు దేశభక్తుడు.

"ఇప్పటికన్నా బుద్ధితెచ్చుకొని, రామా కృష్ణా అని ఇంత దైవ చింతన చేసుకో" అన్నది ముసిల్ది.

"మన్మనాభవమద్భక్తోమద్యాజీ మాంనీమస్కుకు" అన్నాడు సన్నాసి.

"నా మోక్షం గురించి మీకున్న ఆదుర్దా చూస్తే, దేశంలో ఉన్న జనం తాలూకు దుర్దశ మీరెట్లా సహించగలుగుతున్నారో నాకర్థం కావటం లేదు. అయినా నా జోలి మీకెందుకు? మీ దారిన మీరు పొండి!" అన్నాడు దేశభక్తుడు.

"మా దారికి నువ్వడ్డం వస్తున్నావు! దేశాన్ని ఉద్ధరించే నెపం మీద నువు వర్ణసంకరం చేస్తున్నావు. అంతకంటె దేశానికి పతనం లేదు. నువు దేశద్రోహివి! ఇరుగో దేశవాసుల ప్రతినిధులంతా నా వెనక ఉన్నారు. వాళ్లనడుగు!" అన్నది ముసిల్ది.

దేశభక్తుడు నవ్వాడు.

"వీళ్లా దేశవాసుల ప్రతినిధులు! ఈ దౌర్భాగ్య దేశానికి ప్రాతినిధ్యం కూడా ఉందీ?"

"అయితే నీ ప్రయత్నం మానవా?" అన్నది ముసిల్ది వణుకుతున్న గొంతుతో.

"ఇందులో ప్రయత్నం ఏమీ లేదు. నేను కేవలమూ తపస్సు చేసుకుంటున్నాను. నా ధర్మం నేను తెలుసుకోవడానికి ప్రయత్నిస్తున్నాను. అంత మాత్రానే వర్ణసంకరమై పోతుందా?" అన్నాడు దేశభక్తుడు.

"చెడు ఆలోచనలు చెయ్యటం కూడా తప్పే!" అన్నాడు బ్రాహ్మడు అందులో బాగా ఆరితేరిన వాడల్లే.

"మన సేంద్రియైర్వా, బుధ్యాత్మనావా!" అన్నాడు సన్నాసి.

"ఈ శషభిషలకు నేను భిత్తపోను!" అన్నాడు దేశభక్తుడు చికాకుతో.

"కాకః సర్వరసాన్భుక్త్వావినా మేధ్యంనతృప్యతి!" అన్నాడు సన్నాసి, తన సంస్కారం యావత్తూ ప్రకటిస్తూ.

"చండాలుడా! నీ కర్మ అనుభవించు... ఊc! చూస్తావేం? వీడి పని కానివ్వండి!" అన్నది ముసిల్ది.

వెనుక ఉన్న ఆయుధ పాణులంతా ముందుకువచ్చారు.

దేశభక్తుడు వాళ్లకేసి చూసి "కానివ్వండి! ఈ అందరి కర్మనూ నేను అనుభవించ టానికి సిద్ధంగా ఉన్నాను. ఇంత నీచమైన కర్మ ఊరికేపోదా? తమ కర్మ తామే అనుభవించే నైతిక శక్తి వీళ్లకు లేదు. కానివ్వండి – నేనే అనుభవిస్తాను" అన్నాడు.

ఇద్దరాయుధ పాణులు వెనక్కు తగ్గి, తలలు అడ్డంగా తిప్పారు. వెంటనే అధికారి తన ఒరలో నుంచి ఆ ఇద్దరి తలలూ నరికాడు.

"ప్రాణం అన్నిటికన్నా తియ్యనిదనే సూత్రం మీద నమస్కారం ప్రచారం అవుతున్నదన్న మాట!" అన్నాడు దేశభక్తుడు.

"శరీర మాద్యంఖలు ధర్మసాధనం" అన్నాడు సన్నాసి.

ఆయుధపాణులు తమ అనుచరులను చూసి పాఠం నేర్చుకుని ఆటే పస్తాయించ కుండా తమ పని పూర్తి చేసేశారు.

"ఆహా! ఇక్కడికి ఒక లోక కంటకుడు కడతేరాడు" అన్నది ముసిల్ది.

"కలిమహిమ!" అన్నాడు బ్రాహ్మడు.

"యదాయదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత, అభ్యుద్ధానమ ధర్మస్య తదాత్మానం సృజామ్యకం" అన్నాడు సన్నాసి.

***ముద్రణ : ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం మహాసభా సంచిక, మార్చ్ 1943***